క్లుప్తంగా

ఆలయ ప్రతిష్టా మహోత్సవానికి పీఆర్కేకు ఆహ్వానం



మాచర్ల రూరల్: మండలంలోని గన్నవరంలో ఈనెల 11వ తేదీ శ్రీ కోదండరాముని దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గ్రామస్తులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం ఆయనకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ ఐక్యంగా ప్రతిష్టా మహోత్సవం నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చి ఆస్తులను కాపాడాలని వినతి



మాచర్ల రూరల్: ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చికి సంబంధించిన క్రిస్టియన్ పబ్లిక్ హెల్త్ సెంటర్(మిస్సమ్మ హాస్పిటల్) ఆస్తులను కాపాడాలని చర్చి కమిటీ సభ్యులు విన్నవించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ శ్రీశైలం ప్రధాన రహదారిలో యూనియన్ బ్యాంకు ఎదురుగా ఉన్న 75 సెంట్ల విస్తీర్ణంలో భవనం లూథరన్ చర్చిలకు సంబంధించిన ఆస్తులను, వీటిని కొంత మంది అన్యాక్రాంతం చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కటికల సురేష్, జి.పుల్లయ్య, అల్లి జీవన్, పి.డేవిడ్ విల్సన్, ఎం.విద్యాసాగర్, పి.ప్రవీణ్, మార్టిన్ జోసఫ్, ఏలియా, ఇస్సాక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

దేవదాయ భూములు సర్వే చేయించాలని వినతి



రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న దేవదాయ భూములను కచ్చితంగా సర్వే చేయించాలని తహసీల్దార్ దొప్పలపూడి మేరీ కనకంకు ఆ శాఖ ఈఓ గాదె రామిరెడ్డి వినతిపత్రం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వేణుగోపాలస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు ఉన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని మంచికల్లులో భూ రీ సర్వే జరుగుతుందని త్వరలోనే ఆలయాల భూములకు కూడా సర్వే చేయిస్తానని హామీ ఇచ్చారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులోని శ్రీ సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సోమవారం మజ్జిగ పంపిణీకి చలువాది చంద్రశేఖర్, ఏలూరి పూర్ణచంద్రరావు అందజేశారని భగవాన్ శ్రీ సత్యసాయి మందిరం కన్వీనర్ గర్రె నాగేశ్వరరావు తెలిపారు. ఈ మజ్జిగ చలివేంద్రంలో సుమారు 1600 మందికి మజ్జిగను అందజేయటం జరిగిందని పేర్కొన్నారు.

రీసర్వే పనులు ప్రారంభం

నూజెండ్ల: భవిష్యత్‌లో భూ వివాదాలకు తావివ్వకుండా జరుగుతున్న రీసర్వే పనులకు రైతులు సహకరించాలని తహసీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పలపాడు పంచాయతీలో సోమవారం రీసర్వే పనులను ప్రారంభించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పంచాయితీ పరిధిలో 3963 ఎకరాలు భూమి గుర్తించామన్నా రు. అందులో ప్రభుత్వ భూమి ఆర్ఎస్సార్ ప్రకారం 666 ఎకరాలు కాగా నిషేధిత జాబితా ప్రకారం 712 ఎకరాలుగా ఉందన్నారు. అసైన్‌మెంట్ జరిగిన భూమి 226, దేవదాయ భూమి 18.35 ఎకరాలుగా గుర్తించామన్నారు. సర్వేలో సర్వేయర్ చండీరాణి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా స్వప్రకాష్ గురూజీ ఆరాధన

సత్తెనపల్లి: పట్టణంలోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ నిర్మాణ, వ్యవస్థాపక ధర్మకర్త మాతాధిపతులు పూజ్య గురుదేవులు చింతాడ స్వప్రకాష్ గురూజీ ఆరాధన సోమవారం ఘనంగా నిర్వహించారు. గురూజీ శిష్యులు, వంశ పారంపర్య ట్రస్టీలు, భక్తులు గురూజీ విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. ఆశ్రమ ధర్మకర్త మాతాధిపతులు లలితాంబ మాతాజీ ఆధ్వర్యంలో వేద పాఠశాల విద్యార్థులు గురుపూజ నిర్వహించారు. మహామంత్ర పుష్పం, మంగళహారతి, మహా నివేదన సమర్పించి తీర్థప్రసాదాలు అందించారు.

వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



కుంకుమ పూజలో మహిళలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వాసవీ అమ్మవారు

పట్టణంలోని జానపాడు రోడ్డులో వేంచేసియున్న శ్రీ వాసవీ అమ్మవారి జన్మదినం పర్వదినాలను పురస్కరించుకొని అమ్మవారిని సోమవారం నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి దేవస్థానంలో కుంకుమ పూజలు నిర్వహించారు. – పిడుగురాళ్ల

డాక్టర్ రామకోటయ్య సేవలు ఆదర్శనీయం



డాక్టర్ రామకోటయ్య దంపతులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మాచర్ల: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ రామకోటయ్య సేవలు ప్రశంసనీయమని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి కొనియాడారు. ఆదివారం రాత్రి డాక్టర్ వి.ఎల్.దత్తు ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ రామకోటయ్య దంపతుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి, కేసీపీ జనరల్ మేనేజర్ వెంకటరమణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కృష్ణా నది ఒడ్డున మారుమూల ప్రాంతాల్లో నివాసం ఉంటున్న మత్స్యకారుల పిల్లలకు ప్రతి సంవత్సరం పల్స్‌పోలియో చుక్కలు వేసి అంతర్జాతీయ పల్స్‌పోలియో అవార్డును డాక్టర్ రామకోటయ్యకు దక్కించుకోవడం అభినందనీయమన్నారు. తన సొంత నిధులతో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించడంతోపాటు, ఈఎస్ఐ వైద్యులుగా ఆయన అందించిన వైద్య సేవలు మరువలేనివన్నారు. పలు సేవలు అందిస్తూ వైద్యులకు ఆదర్శంగా నిలిచారన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సుమంత్‌కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కృష్ణకుమారి, కార్యదర్శి నిమ్మగడ్డ సురేఖ, కోశాధికారి లక్ష్మీ, డాక్టర్ మురహరి రావు, చెరుకూరి నరసింహారావు, రామూర్తి, పఠాన్ నాగూర్‌వలి, సత్యప్రసాద్, కృష్ణవేణి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ వై.వెంకటరామయ్య, మామిళ్లపల్లి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక



సత్యప్రసాద్



కోటేశ్వరరావు



వై.వెంకటరామయ్య

మాచర్ల: రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు రోటరీ క్లబ్ నిర్వాహకులు డాక్టర్ రామకోటయ్య, పఠాన్ నాగూర్‌వలి సోమవారం తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా సత్యప్రసాద్, కార్యదర్శిగా ఆలేటి కోటేశ్వరరావు, కోశాధికారి వై.వెంకటరామయ్య ఎంపికైనట్లు వెల్లడించారు. నూతన కార్యవర్గం త్వరలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

మైనార్టీ ఆడబిడ్డలు, తల్లిదండ్రులకు రక్షణ ఉందా?

- తూర్పుగోదావరి నిడదవోలు సంఘటనపై ముస్లిం నాయకుల ఫైర్
- కూరగాయల మార్కెట్‌సెంటర్‌లో నిరసన



నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు గ్రామానికి చెందిన వలి అనే వ్యక్తిని అతిదారుణంగా హత్య చేసిన అనిల్ అలియాస్ కిరణ్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. జరిగిన దారుణంపై సోమవారం స్థానిక లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్‌సెంటర్‌లో ఎంహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ 2021లో వలి కూతురిని హింసిస్తున్న అనిల్‌పై చేసిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి అరెస్టుచేసి జైలుకు పంపించారన్నారు. ఆ కేసు ఇప్పుడు విచారణకు రావటంతో కేసు రాజీకి రావాలని బెదిరింపులకు దిగి రాజీకి ఒప్పుకోని వలిని ఈనెల నాల్గున మజీద్‌కు వెళ్లి వస్తున్న సమయంలో హత్య చేయటం జరిగిందన్నారు. రాష్ట్రంలో హోం మంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ రాష్ట్రంలో మైనార్టీ ఆడబిడ్డలకు వారిని కన్న తల్లిదండ్రులకు రక్షణ ఉందా అంటే ఈ సంఘటనతో లేదనే అనిపిస్తోందన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు బాధ్యుల కుటుంబాలను మహిళా కమిషన్ చైర్మన్ స్పందించి వారి కుటుంబానికి రక్షణ కల్పించాల్సి వుండగా ఇప్పటివరకు ఆ కుటుంబాన్ని ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కనీసం ఫోన్ ద్వారా కూడా మాట్లాడి మనోధైర్యం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. దీనిని బట్టి కూటమి ప్రభుత్వానికి మైనారిటీ ప్రజలకు రక్షణ ఇవ్వటం ఇష్టంలేనట్లుగా కన్పిస్తుందన్నారు. ఇలాంటి సంఘటన మరోసారి జరగకుండా ఉండాలంటే నిందితుడికి ఉరిశిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మాబు, జిల్లా కార్యదర్శి, ఖాసీం పీరా, ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షులు మౌలాలి, వలి మేస్త్రీ, మాబు శారీఫ్, సైదా, మౌలాలి, అబ్దుల్ కరీం, రొంపిచర్ల మండల అధ్యక్షులు ఇమ్మంషా, కరీముల్లా పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



నూజెండ్ల: శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన రేపు ఘనంగా నిర్వహించనున్నారు. మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన స్వామి వారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గ్రామ వాస్తవ్యులు యెల్లేపల్లి వెంకట సుబ్రమణ్యశాస్త్రి స్థలం అందించగా చందాల రూపంలో వచ్చిన 60 లక్షల నిదులతో గ్రామస్తులు ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. స్వామి వారి ఆరాధనలో చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కమిటీ పెద్దలు కోరారు.

అదనపు గదుల నిర్మాణానికి రూ.2.12 కోట్లు నిధులు



మాచవరం: బాలికా విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పిల్లుట్ల కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం అప్‌గ్రేడ్ జూనియర్ కళాశాల అదనపు గదుల నిర్మాణానికి శిలా ఫలకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో అదనపు గదులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.2 కోట్లు 12 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు చేపట్టి పూర్తి చేస్తామని చెప్పారు.

యువకుడిపై గుర్తు తెలియని దుండగులు దాడి

సత్తెనపల్లి: ప్రైవేట్ ఉద్యోగిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసిన ఘటన పల్నాడు సత్తెనపల్లిలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన యువకుడు పోకూరి మణికంఠ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ వర్క్ ఫ్రమ్ హోంలో ఉన్నాడు. కంపెనీ పని నిమిత్తం హైదరాబాదు వెళ్లేందుకు బ్యాగు, ల్యాప్‌టాప్ తీసుకొని రైల్వేస్టేషన్‌కు నడుచుకుంటూ వెళుతున్నాడు. రైల్వేస్టేషన్‌రోడ్‌లోని సచివాలయం సమీపంలో ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన నలుగురు గుర్తుతెలియని దుండగులు దాడి చేసి ల్యాప్‌టాప్, బట్టలు బ్యాగును అపహరించుకుపోయారు. దీంతో లబోదిబో మంటూ మణికంఠ పట్టణ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజీల ఆధారంగా దాడి చేసిన దుండగులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. పట్టపగలు యువకుడిపై జరిగిన ఈ దాడి ఘటన పట్టణంలో చర్చనీయాంశమైంది.

10, 11 తేదీల్లో తెలుగు సాహితీ సంబరాలు

నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ సాహిత్య సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీలలో ఏలూరులోని వేణుగోపాల స్వామి కళ్యాణ మండపంలో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహిస్తున్నట్లు కళావేదిక జాతీయ కార్యదర్శి గుండాల రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబరాలలో భాగంగా కవితోత్సవం, సాహితీ సదస్సులు, రంగస్థల ప్రదర్శనలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, పుస్తకా విష్కరణలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు కవులు, రచయితలు, కళాకారులు దాదాపు రెండువేల మంది సంబరాలలో పాల్గొంటారని తెలిపారు. సాహితీ చరిత్రలో అతి పెద్ద కార్యక్రమంగా నిలుస్తుందనీ, పలు ప్రపంచ రికార్డు సంస్థలు ఈ కార్యక్రమాన్ని వరల్డ్ రికార్డుగా నమోదు చేసేందుకు హాజరవుతున్నట్లు తెలిపారు. కళావేదిక సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో కన్వీనర్లు కొల్లి రమాదేవి, డాక్టర్ పార్థసారధి, జి.ఈశ్వరీ భూషణం కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని తెలిపారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

మాచర్ల రూరల్: విద్యా వ్యవస్థను దెబ్బతీసే ప్రభుత్వ విధానాలను మానుకోకపోతే ఉద్యమిస్తామని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ రవికుమార్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట సోమవారం ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల స్థానంలో 1,2 తరగతులతో వేల సంఖ్యలో ఫౌండేషన్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నారని 8, 9 రకాల పాఠశాలల ఏర్పాటు కోసం ప్రభుత్వం పథక రచన చేస్తుందని, ఈ రకమైన పాఠశాలలో ఒక్కొక్కరకంగా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తులను సూచిస్తుందని ప్రశ్నించారు. పాత విధానాన్ని రద్దు చేసి కొత్త విధానాన్ని ఏర్పాటు చేయటం వలన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులూ గందరగోళానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే 1 నుంచి 5 తరగతులలో మోడల్ ప్రాథమిక పాఠశాలలు కొనసాగించాలని, 6 నుంచి 10వ తరగతులకు ఉన్నత పాఠశాలలను యథావిధిగా ఉంచాలని కోరారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వై.అమర వెంకటేష్, నాయకులు కె.పిచ్చయ్య, శివానందకుమార్, సిహెచ్.కొర్లయ్య, కోటేశ్వరరావు, నాగరాజు, జె.బాలు, కె.కృష్ణార్జి నాయక్, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

• చాలా రేటు గురూ!



రెంటచింతలలో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ఎర్రమట్టి కుండలు

వేసవిలో మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది. కుండ ధర ప్రస్తుతం రూ.450లకు పలుకుతోంది. తప్పని పరిస్థితులలో కొనుగోలు చేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. విజయవాడ దగ్గర నున్నలో తయారుచేసే నాణ్యమైన ఎర్రమట్టి కుండలను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తూ రెంటచింతలకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. – రెంటచింతల

నేడు యడ్లపాడులో ఆలయ వార్షికోత్సవం



యడ్లపాడు రాజేశ్వరస్వామి దేవాలయం

యడ్లపాడు: భక్తుల నమ్మకానికి నిలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రాజేశ్వరస్వామి వారి దేవస్థానం 8వ వార్షికోత్సవ మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. వేకువ జామునుండే స్వామి వారికి అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు, పలు రకాల ప్రసాద వినియోగం ఉంటాయన్నారు. సాయంత్రం 6 గంటలకు కంద్రిక, యడ్లపాడు, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాలకు చెందిన భజనమండలీలకు చెందిన 60 మంది హాజరై ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శన ఇస్తారని తెలిపారు. 7 గంటలక కొటప్పకొండకు పండితులు కొండకావూరి అప్పయ్యగురుకులు, ప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు జంధ్యాల శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యాన శివపార్వతుల శాంతి కల్యాణ వేడుకలు శాస్త్రోక్తంగా జరుగుతాయన్నారు. ఈ పవిత్ర శివ కల్యాణ దర్శనం అనంతరం, రాత్రి 8 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆలయాన్ని సందర్శించి స్వామి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

వేసవిలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న అమలకుమారి

నరసరావుపేట రూరల్: వేసవిలో పంట భూములు బీడుగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో సోమవారం రైతు శాస్త్రవేత్తల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ రైతు శాస్త్రవేత్తల నాలుగు సంవత్సరాల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సెమిస్టర్ 2, 4 విద్యార్థులకు తరగతులు నిర్వహించినట్టు తెలిపారు. వేసవిలో పొలాలు ఖాళీగా ఉంచకుండా 30రకాల విత్తనాలతో కూడిన ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని పాటించాలని తెలిపారు. తోటలు ఇతర పంటలలో ఎల్ అకారపు కట్టలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీపీ కిరణ్మయి, డీపీపీ భవానిరాజు, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



ర్యాలీ చేస్తున్న అధికారులు

నూజెండ్ల: భూమిలో సేంద్రియ కార్బన్ శాతం తగ్గటం వల్ల పంట దిగుబడులు ఆశాజనకంగా ఉండటం లేదని వినుకొండ డివిజన్ ప్రకృతి వ్యవసాయ నిపుణులు బి.తిరుపతిరావు అన్నారు. మండలంలోని బి.అప్పాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం కార్యాచరణపై గ్రామసభ ర్యాలీ ప్రకృతి వ్యవసాయ నిపుణులు రైతులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధిస్తామన్నారు. క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. పైరులో యూరియా డీఏపీ, రసాయనిక ఎరువులు కాకుండా ఘన జీవ అమృతం వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, వి.అశోక్, రోశిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ శివలక్ష్మి ఉన్నారు.

కూరగాయల వ్యాపారిపై దాడి

టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు

నరసరావుపేట టౌన్: కూరగాయల వ్యాపారిపై కొందరు యువకులు దాడికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. బాబాపేట వద్ద ఉన్న హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో ఇంటూరి నాగేశ్వరరావు కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. నాగేశ్వరరావు దుకాణం పక్కనే తోట సురేష్‌కు కూరగాయల దుకాణం ఉంది. అతడి దుకాణానికి సరుకు దించేందుకు వచ్చిన లారీ సురేష్ దుకాణం ఎదుట నిలిపారు. దీంతో సురేష్ వాగ్వాదానికి దిగి అతని స్నేహితులు ఆర్.పి.వాసు, సుబ్బారావు మరి కొందరితో కలిసి నాగేశ్వరరావుపై దాడికి పాల్పడ్డారు. అనంతరం నాగేశ్వరరావు దుకాణానికి తాళాలు వేసి దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు సోమవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై సీఐ హైమారావును వివరణ కోరగా కూరగాయల వ్యాపారం నిర్వహణలో గొడవ జరిగిందని ఫిర్యాదు అందిందన్నారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్ఐగా నరసింహ బాధ్యతలు స్వీకారం



మాచర్ల రూరల్: రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐగా వి.నరసింహ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పట్టణ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రవికుమార్ క్రోసూరు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో శాంతి భద్రతలను పర్యవేక్షిస్తూ గ్రామ ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. గ్రామాల్లో ఎవరైనా వర్గాలను గ్రూపులను ప్రోత్సహిస్తూ అసంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. నరసింహను పోలీసు సిబ్బంది పూలమాల, శాలువతో ఘనంగా సత్కరించారు.

గడ్డివామిలో రాజుకున్న అగ్గి

యడ్లపాడు: స్థానిక మేదర వీధిలోని కొండ సాంబయ్యకు చెందిన వరిగడ్డి వామిలో సోమవారం ఉదయం 10.30 సమయంలో దట్టమైన పొగలు రావడం స్థానికులు గమనించారు. అగ్ని రాజుకుంటుందని పసిగట్టి వెంటనే స్పందించారు. మోటార్‌తో నీళ్లు కొట్టగా, మరొకరు పొక్లెయిన్ తీసుకొచ్చి వామిని పక్కకు నెట్టి మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. అతి దగ్గరలో ఉన్న గేదెలను సకాలంలో కట్లు విప్పి బయటకు పంపించేశారు. స్థానికుల సమయస్ఫూర్తి వల్ల మంటలు మరింత వ్యాపించక ముందే ఆర్పివేయడంతో అంతా పెనుప్రమాదాన్ని తప్పించారని ఊపిరి పీల్చుకున్నారు.

20న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

నరసరావుపేట: స్వాతంత్ర్యం కంటే ముందే పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను కాల రాసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, వాటి రద్దు కోసం దేశ కార్మిక వర్గం మొత్తం ఉద్యమించాలని సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయునాయక్ పిలుపునిచ్చారు. సోమవారం కోటప్పకొండ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని వివిధ సంఘాల నాయకులతో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ సమ్మెకు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు భారతదేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం అవుతున్నారని తెలిపారు. సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్, అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, రైతు సంఘ జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి రవిబాబు, కౌలు రైతు సంఘ పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి, పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.